సాక్షి
గుంటూరు
శనివారం। 5। ఏప్రిల్। 2025




రిఫ్రిజిరేటర్ బహూకరణ

పిడుగురాళ్ల: పట్టణ పోలీస్ స్టేషన్‌కు రిఫ్రిజిరేటర్‌ను తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల తరఫున శుక్రవారం అందించారు. డీఎస్పీ జగదీష్ పాల్గొన్నారు.



వైభవంగా మహా కుంభాభిషేకం

పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని తెలగ పాలెంలో ఉన్న కోదండ రామాలయంలో మహా కుంభాభిషేకం మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 517.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 3,031 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ బండారు



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్‌ఎస్)గా డాక్టర్ బండారు వెంకట రంగారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన డాక్టర్ బండారు కర్నూలు మెడికల్ కాలేజీలో 1982లో ఎంబీబీఎస్ చదివారు. 1992లో పీడాటిక్స్‌లో పీజీ వైద్య పూర్తి చేశారు. మెదక్ జిల్లా ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరారు. 2009లో డెప్యూటీ సివిల్ సర్జన్‌గా ఉద్యోగోన్నతి పొంది ప్రకాశం జిల్లా కంభంకు బదిలీ అయ్యారు. 2019లో సివిల్ సర్జన్‌గా ప్రమోషన్ పొంది మాచర్లకు బదిలీ అయ్యారు. 2014లో బాపట్ల ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పని చేశారు. 2022 నుంచి పల్నాడు డీసీహెచ్‌ఎస్‌గా నరసరావుపేట ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. గుంటూరు పట్టాభిపురంలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బండారు రంగారావును పలువురు వైద్యులు, కార్యాలయ ఉద్యోగులు అభినందించారు.

మేలో వేద విద్వత్ ప్రవర్ధన పరీక్ష సభలు

తెనాలి: కృష్ణా–గుంటూరు మండల వేద విద్వత్ ప్రవర్ధక పరీక్షా సభలు మే నెలలో జరగనున్నట్టు కార్యవర్గం శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. రూరల్ మండల గ్రామం పెదరావూరు సుబ్రహ్మణ్యపురంలోని శ్రీఅభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో మే 2,3,4 తేదీల్లో వేద పరీక్షలు, వేదసభలు జరపనున్నారు. జగద్గురువులు శ్రీరామచంద్రేంద్ర సరస్వతీ స్వామి అనుగ్రహంతో నిర్ణయించినట్టు తెలిపారు. వివరాలకు 9441344028 నంబరును సంప్రదించాలని కోరారు.

బోయపాలెం డైట్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్తిపాడు మండలం బోయపాలెం జిల్లా వృత్తి విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో సీనియర్ లెక్చరర్, లెక్చరర్ పోస్టుల్లో డెప్యూటేషన్‌పై పని చేసేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను డిప్యూటేషన్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 10 వరకు దరఖాస్తులు స్వీకరించి, ఈనెల 16,17వ తేదీల్లో పరీక్షలు, ఈనెల 19న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డైట్‌బోయపాలెం.కామ్ సందర్శించాలని, సందేహాల నివృత్తికి 94408 46046 నంబర్లో సంప్రదించాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తును ప్రతి సబ్జెక్టుకు వేర్వేరుగా చేయాలని, దరఖాస్తుల స్వీకరణకు గుంటూరు డీఈవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జీజీహెచ్‌లో మీకోసం మేము



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో మీకోసం మేము పేషెంట్ డాక్టర్ ఇంటరాక్షన్ కార్యక్రమం 7వ వారం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ పేషెంట్‌లకు హాస్పిటల్ నియమావళి గురించి వివరించారు. ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వద్దని సూచించారు.

పోయిన డబ్బులు దొరికాయోచ్..!

ముప్పాళ్ళ: పింఛన్ డబ్బులు పోయాయి... మరలా దొరికాయోచ్...! అవును ఇది నిజమే. డబ్బులు కట్టకట్టి మరీ గ్రామసచివాలయంలోనే ఉంచడం మరింత ఆశ్చర్యకరం. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామ సచివాలయంలో పని చేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్ పంపిణీ చేయాల్సిన పింఛన్ సొమ్ములో రూ.50 వేలు ఈ నెల 1వ తేదీన గ్రామ సచివాలయంలోనే పంపిణీకి ముందు కనిపించకుండా పోయాయి. సహచర సిబ్బంది, మిత్రుల వద్ద డబ్బు అప్పుగా తీసుకొని పింఛన్ పంపిణీని సజావుగా పూర్తి చేశారు. మూడు రోజుల తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలోనే శుక్రవారం ఉదయం సచివాలయం తెరవగానే రూ.50 వేల నగదును ఒక కవర్‌లో పెట్టి నేలపై కనిపించాయి. ఇదంతా ఇంటి దొంగల పనే అనే అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

వక్ఫ్ సవరణ గర్జన

భగభగ మండే భానుడి సాక్షిగా ముస్లింలు గళమెత్తి గర్జించారు. వక్ఫ్ సవరణ బిల్లుపై రణన్నినాదం పూరించారు. ఓట్ల రాజకీయం చేసే పార్టీలూ ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ముఖ్యంగా టీడీపీ, జనసేన అధినేతల తీరుపై ధ్వజమెత్తారు. బిల్లుకు మద్దతు తెలపడాన్ని నిరసించారు. కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే జనాగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు.

- బిల్లుపై ముస్లింల ఆగ్రహం
- పోరాటానికి సిద్ధం
- కేంద్రమంత్రి పెమ్మసాని రాజీనామా చేయాలని డిమాండ్
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఇంట్లో కూర్చుంటే కుదరదని హెచ్చరిక



వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా గుంటూరులో నినాదాలు చేస్తున్న ముస్లిం సంఘాలు, పలు పార్టీల నేతలు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలో ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును తక్షణమే రద్దు చేయాలని, ముస్లింల ఓట్లతో అధికారంలోకి వచ్చిన పెద్దలందరూ ఈ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ నూరిఫాతిమా డిమాండ్ చేశారు. స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, సీపీఐ, ముస్లిం ఐక్యవేదిక, ఆవాజ్ కమిటీ, పలు ముస్లిం సంఘాలన్నీ ఐక్యంగా వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టాయి. ముందుగా బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద నుంచి భారీ సంఖ్యలో ముస్లింలు ప్రదర్శనగా బయలుదేరారు. మార్కెట్ సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. దారి పొడవునా ముస్లింలు చంద్రబాబుడౌన్ డౌన్, నరేంద్రమోదీ డౌన్ డౌన్, వక్ఫ్ సవరణ బిల్లును తక్షణమే రద్దు చేయాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

పెమ్మసాని రాజీనామా చేయాలి

అనంతరం నూరిఫాతిమా మాట్లాడుతూ ఎన్నికల ముందు ముస్లిం మైనార్టీల హక్కులకు భంగం కలిగితే రాజీనామాలకూ వెనకాడబోమని గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారని, ఇప్పుడు వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుపై ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. పెమ్మసాని తక్షణం రాజీనామా చేసి ముస్లింల పక్షాన పోరాడాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వక్ఫ్‌బోర్డు బిల్లుపై తక్షణం స్పందించాలని, కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన మద్దతును వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. గుంటూరు తూర్పులో ముస్లింల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఇంట్లో కూర్చోవడం సరికాదని, ముస్లింల పక్షాన పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా పలువురు ముస్లిం ప్రముఖులు వక్ఫ్ సవరణ బిల్లుపై గళమెత్తారు. టీడీపీ, జనసేన ద్వంద్వ వైఖరిపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ముస్లిం సంఘాలు, వామ పక్ష నాయకులు, మతపెద్దలు, ముస్లిం సోదరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



గుంటూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలి



వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు అన్యాయం. పార్లమెంటులో దీనిని ఆమోదించుకోవడం తగదు. మోదీ ప్రభుత్వం ముస్లింలపై కక్ష కట్టింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 50 శాతం వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయి. ఇప్పుడు ఈ బిల్లు వల్ల కలెక్టర్ల ద్వారా వక్ఫ్ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– షేక్ వలి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

బాబు, పవన్ ముస్లిం ద్రోహులు



ముస్లింలపై కక్ష కట్టిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే అనేక నల్ల చట్టాలను తీసుకొచ్చింది. తాజాగా వక్ఫ్ సవరణ బిల్లును కుట్రపూరితంగా ఆమోదించుకుంది. ముస్లింలు బ్రిటిష్‌వారి తూటాలకే భయపడ లేదు. బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ దేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనలేదు. ఇప్పుడు దేశం కోసం అంటూ బీజేపీ కాకమ్మ కబుర్లు చెబుతోంది. రాష్ట్రంలో ముస్లింల ఓట్లతో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమికి తగిన బుద్ధి చెబుతాం. ముస్లిం ద్రోహులుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మిగిలిపోతారు.

– గులాం రసూల్, వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకులు

బాబు మాట ఇచ్చి తప్పారు



పవిత్ర రంజాన్ మాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసి వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వబోమని, ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా ఏ పనీ చేయబోమని హామీ ఇచ్చారు. కానీ పండగ అయి రోజులు గడవక ముందే వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు పలికారు. ఇది ముస్లింలకు ద్రోహం చేయడమే.

– షేక్ బాజీ, ముస్లింల ఐక్యవేదిక రాష్ట్ర జనరల్ సెక్రటరీ

బీజేపీ తొత్తులు బాబు, పవన్



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా ఎన్నో చట్టాలను తీసుకొచ్చింది. ఇప్పుడు వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చింది. ముస్లింలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోంది. ఇది తగదు. బీజేపీకి తొత్తులుగా పవన్, బాబు పనిచేస్తున్నారు. ముస్లింలకు ద్రోహం చేస్తున్నారు.

– ఎం.ఎ.చిష్టి, ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి

చంద్రబాబు సమాధానం చెప్పాలి



కేంద్రంలోని బీజేపీ సర్కారు అంటే టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు భయమెందుకు? ఎన్నికల ముందు ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఇది తగదు. తక్షణమే వక్ఫ్ సవరణ బిల్లుకు ఇచ్చిన మద్దతును ఉపసంహరించుకోవాలి. చంద్రబాబు సమాధానం చెప్పాలి.

షేక్.మస్తాన్ వలి, కాంగ్రెస్‌నేత, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే

మిర్చి ఘాటు చూపిస్తాం



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు రాధాకృష్ణ, అజయ్‌కుమార్ తదితరులు.

- ఆదుకోకుంటే త్వరలో యార్డు ముట్టడి
- ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల హెచ్చరిక

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి రైతులను ఆదుకోవాలని కోరుతూ గుంటూరు మిర్చి యార్డులో ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంచుమాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన క్వింటా మిర్చి ధర రూ.11,781లు మోసపూరితంగా ఉందని ధ్వజమెత్తారు. రైతులు క్వింటా మిర్చి పండించడానికి రూ.25 వేలు నుంచి రూ.30 వేలకు పైగా ఖర్చు అవుతుండగా, దీనిలో సగం మద్దతు ధర కల్పించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అండతోనే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతుల నుంచి మిర్చిని నేరుగా కొనుగోలు చేస్తే రైతులు, కౌలు రైతులకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. 2019 నుంచి 2023 వరకు క్వింటా మిర్చి రూ.18 వేలు నుంచి రూ.27 వేల వరకు ధర వచ్చిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కేవలం రూ.7 వేలు నుంచి రూ.13 వేలు లోపు ధర పలికిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవే ధరలు కొనసాగితే రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ కింద కేవలం రూ.300 కోట్లు కేటాయించడం చూస్తే రైతులంటే కూటమి ప్రభుత్వానికి లెక్కలేదని స్పష్టమవుతోందని విమర్శించారు. ధరల స్థిరీకరణ నిధి కింద రూ.ఐదువేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముందుగా నరసరావుపేట రోడ్ వైపు ప్రధాన గేటు నుంచి నినాదాలు చేస్తూ మిర్చి యార్డు కార్యదర్శి చాంబర్ వరకు రైతులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం యార్డు కార్యదర్శి ఎ.చంద్రికకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన యార్డు కార్యదర్శి చంద్రిక మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ఇప్పటివరకు ఎలాంటి విధి విధానాలు రాలేదని చెప్పారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిర్చి రైతులను ఆదుకోకపోతే త్వరలో మిర్చి యార్డును ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల గుంటూరు, పల్నాడు జిల్లాల నాయకులు బైరగాని శ్రీనివాసరావు, కె.రామారావు, జి.బాలకృష్ణ, బి.రామకృష్ణ, బిక్కి శ్రీనివాస్, జి.పిచ్చారావు, ఈపూరి అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదక హెచ్చరిక

- యథేచ్ఛగా మాదకద్రవ్యాల అమ్మకాలు
- అడ్డూఅదుపూ లేని గంజాయి రవాణా
- కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత విశృంఖలం
- ఎక్కడికక్కడ పట్టుకుంటున్నా ఆగని దందా



పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత గుంటూరులో మాదకద్రవ్యాల అమ్మకాలు పెరిగాయి. గంజాయి ఘాటు గుప్పుమంటోంది. పోలీసులు ఎక్కడికక్కడ పట్టుకుంటున్నా.. కొత్త మార్గాల్లో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గంజాయి క్రయవిక్రయదారుల్లో యువత, విద్యార్థులే అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఇది ప్రమాద సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మత్తుకు బానిసవుతున్న యువత, విద్యార్థులు

కొద్ది రోజుల క్రితం న్యూ గుంటూరు రైల్వేస్టేషన్‌లో ముగ్గురు యువకులను కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి మూడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురూ 25 ఏళ్లలోపు యువకులే. ఈ నెల 3న అరండల్‌పేట పోలీసులు గంజాయి విక్రయిస్తున్న కిరణ్‌బాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే కొంత కాలం క్రితం లాలాపేట పోలీసుస్టేషన్ పరిధిలోని భ్రమరాంబ టౌన్‌షిప్ వద్ద గంజాయి విక్రయిస్తున్న కొంత మంది యువకులు, విద్యార్థులను అదుపులోకి తీసుకుని, వారి ఇచ్చిన సమాచారం ఆధారంగా సుమారు 8 మంది యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద కూడా భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నగర పరిసరాల్లోని ఇంజినీరింగ్ విద్యార్థులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు సాగుతున్నట్టు సమాచారం. కొత్తపేట పోలీసుస్టేషన్ పరిధిలోని మణిపురం ఓవర్‌బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తున్న మరో యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలో కొన్ని నెలల క్రితం గంజాయి వినియోగిస్తూ పట్టుబడిన విద్యార్థుల తల్లిదండ్రులను పోలీసులు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. 41 నోటీసులు జారీ చేసి పంపారు. గంజాయి సరఫరా చేస్తున్న వారిలో డీఎంఎల్‌టీ విద్యార్థులూ ఉండడం గమనార్హం.

ద్విచక్ర వాహనాలపై వెళ్లి..

మాదక ద్రవ్యాలు, మత్తుకు అలవాటు పడిన యువత, విద్యార్థులు సులువుగా డబ్బు సంపాదించేందుకు వాటినే ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నారు. గుంటూరు నుంచి విశాఖపట్నం, అరకు, పాడేరు, ఒడిశా, శ్రీకాకుళం ప్రాంతాలకు ద్విచక్రవాహనాలపై వెళ్లి కిలోల లెక్కన గంజాయి కొని గుంటూరుకు తీసుకొస్తున్నారు. కిలో రూ.4వేలు నుంచి రూ.ఐదువేలకు కొన్న ఆ గంజాయిని వారు వినియోగించడమే కాకుండా స్నేహితులు, విద్యార్థులకు కిలో రూ.20వేల చొప్పున విక్రయిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం కాజ టోల్‌ప్లాజా వద్ద ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

విద్యార్థులు, యువత పెడమార్గాలు పట్టకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని పోలీసులు సూచిస్తున్నారు. పిల్లలు ఏం చేస్తున్నారు. ఎలాంటి స్నేహాలు చేస్తున్నారనేది ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని చెబుతున్నారు.

పొట్లాలుగా కట్టి.. మరీ..

ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన గంజాయిని పొడి చేసి పొట్లాలుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. న్యూగుంటూరు రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాలనీ, మణిపురం ఓవర్‌బ్రిడ్జి కింద, పాతగుంటూరు సుద్దపల్లి డొంక, నందివెలుగు రోడ్డులోని ఉన్న ఒక ఖాళీ వెంచర్, గుజ్జగుండ్ల సెంటర్ సమీపం, శారదా కాలనీ, కృష్ణబాబుకాలనీ, ఐపీడీకాలనీ, సంపత్‌నగర్‌లోని కొబ్బరితోట ప్రాంతం, కేవీపీ కాలనీలో పాటు పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు అధికంగా జరుగుతున్నట్టు సమాచారం. లిక్విడ్, సిగరెట్ల రూపంలోనూ గంజాయిని విక్రయిస్తున్నారు.

భవితను నాశనం చేసుకోవద్దు



మాదక ద్రవ్యాలకు బానిసలై భవితను నాశనం చేసుకోవద్దు. దేశాభివృద్ధిలో యువత, విద్యార్థులు కీలకం. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ముఖ్యం. గంజాయి రవాణాను అరికట్టేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాం. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఎవరైనా గంజాయి విక్రయాలు చేస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలి.

షేక్ అబ్దుల్‌అజీజ్ (డీఎస్పీ, ఈస్ట్ సబ్‌డివిజన్)

‘బర్డ్‌ఫ్లూ మృతి’ పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట: బర్డ్‌ఫ్లూ వ్యాధితో రెండేళ్ల చిన్నారి ఆరాధ్య మృతి నేపథ్యంలో వెంటనే పల్నాడు జిల్లాను బర్డ్‌ఫ్లూ ఇన్‌ఫెక్షన్ సెంటర్‌గా ప్రకటించాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్య ఫలితమేనని అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలయ్యనగర్ ఒకటో లైనులో ఉండే ఆరాధ్య కుటుంబాన్ని కేంద్ర బృందం పరిశీలించే సమయంలో ఆయన కూడా అక్కడకు వచ్చారు. జరిగిన విషయాన్ని తల్లిదండ్రులు పెండ్యాల గోపీ, జ్యోతిలను అడిగి తెలుసుకున్నారు. వారికి కొంత ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బాలిక బర్డ్‌ఫ్లూతో చనిపోవటం బాధాకరమన్నారు. ప్రతిష్టాత్మకమైన మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు అవయవాలు పనిచేయక పోవడం వల్ల బాలిక చనిపోయిందని నిర్ధారించారన్నారు. మొదటి బర్డ్‌ఫ్లూ కేసు 2021లో మహారాష్ట్రలో నమోదు కాగా, తిరిగి రెండో కేసు నరసరావుపేటలో నమోదు కావడం బాధాకరమైన విషయమన్నారు. జిల్లాను బర్డ్‌ఫ్లూ ఇన్‌ఫెక్షన్ సెంటర్‌గా ఎందుకు ప్రకటించలేదని గోపిరెడ్డి ప్రశ్నించారు.

ఇంకొల్లులో భారీ దొంగతనం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఇంకొల్లు (చినగంజాం): బాపట్ల జిల్లా ఇంకొల్లులో భారీ దొంగతనం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి బీరువాలో దాచి ఉంచిన రూ.55.50 లక్షల నగదు, రూ.20 లక్షల విలువైన బంగారు నగలు అపహరించుకుని తీసుకెళ్లారు. ఎస్‌ఐ జీ సురేష్ అందించిన సమాచారం ప్రకారం... ఇంకొల్లు గ్రామంలో ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న ఇంటిలో జాగర్లమూడి శివప్రసాద్ నివాసం ఉంటున్నారు. ఆయన రెండో అంతస్తులో నిద్రిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా ఇంటిలోని మూడో అంతస్తులోకి ప్రవేశించి గది తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.55.50 లక్షల నగదు, 24 సవర్ల బంగారు వస్తువులను అపహరించి తీసుకెళ్లారు. ఉదయం నిద్ర లేచిన ఆయన దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రంగంలోకి దిగి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **6,500** గరిష్ఠం : రూ. **9,000**

మోడల్ ధర రూ. **7,700**

క్లుప్తంగా

పసుపు ధరలు



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో శుక్రవారం 635 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 464 బస్తాలు వచ్చాయని, కనిష్ఠ ధర రూ.10,225, గరిష్ఠ ధర రూ.13,150, మోడల్ ధర రూ.12,811 పలికినట్టు వివరించారు. కాయలు 171 బస్తాలు వచ్చాయని, కనిష్ఠ ధర రూ.10,225, గరిష్ఠ ధర రూ.12,850, మోడల్ ధర రూ.12,811 పలికినట్టు వెల్లడించారు. మొత్తం 476.250 క్వింటాళ్లు అమ్మకాలు జరిగినట్లు వెల్లడించారు.

1,23,485 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,13,955 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,23,485 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,300 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 47,777 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

నేడు వీఆర్‌ఏల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర సదస్సు శనివారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, ఈ సదస్సును వీఆర్‌ఏలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవా ధ్యక్షులు బి.లక్ష్మణరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డే బాజీబాబు,షేక్ నాగులమీరా శుక్రవారం పిలుపునిచ్చారు. వీఆర్‌ఏలకు గత ఎనిమిది సంవత్సరాలుగా జీతాల పెంపుదల లేక కేవలం రూ.10,500తో మాత్రమే సర్కారు వెట్టి చాకిరీ చేయిస్తోందని ఆవేదన చెందారు.

పచ్చిరొట్ట విత్తన ధరలు ఖరారు

- ఉమ్మడి గుంటూరు జిల్లాకు 9,536 క్వింటాళ్ల కేటాయింపు
- 50 శాతం రాయితీతో రైతులకు జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు

కొరిటెపాడు(గుంటూరు): పచ్చిరొట్ట విత్తన ధరలు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఖరీఫ్‌లో రాయితీ విత్తన పంపిణీ ప్రక్రియలో భాగంగా ఏటా రైతులకు ఉపయోగపడే పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న విషయం తెలిసిందే. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర పొలాల్లో చల్లి పూతకు వచ్చిన తర్వాత కలియదున్నితే సేంద్రీయ పదార్థం బాగా పెరుగుతుందని శాస్త్రీయంగా నిరూపితమైంది. దీంతో ఇటీవల ఈ విత్తనాలకు రైతుల నుంచి డిమాండ్ పెరిగింది. ఫలితంగా ప్రభుత్వం రాయితీపై వీటిని అందిస్తోంది. తాజాగా రాయితీ ధరలను ఖరారు చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా(గుంటూరు, పల్నాడు, బాపట్ల)కు ఈ ఏడాది 9,536 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు కేటాయించారు. అందులో గుంటూరు జిల్లాకు 301 క్వింటాళ్ల జీలుగ, 436 క్వింటాళ్లు జనుము, 967 క్వింటాళ్లు పిల్లిపెసర కలిపి మొత్తం 1,704 క్వింటాళ్లు కేటాయించారు. పల్నాడు జిల్లాకు 2,607 క్వింటాళ్ల జీలుగ, 1,559 క్వింటాళ్లు జనుము, 1,178 క్వింటాళ్లు పిల్లిపెసర కలిపి మొత్తం 5,544 క్వింటాళ్లు కేటాయించారు. అలాగే బాపట్ల జిల్లాకు 856 క్వింటాళ్లు జీలుగ, 853 క్వింటాళ్లు జనుము, 779 క్వింటాళ్లు పిల్లిపెసర కలిపి మొత్తం 2,488 క్విటాళ్లు కేటాయించారు. వీటిని 50 శాతం రాయితీతో రైతులకు ఇవ్వనున్నారు. ఏపీ సీడ్స్ ద్వారా వీటిని సరఫరా చేసి రైతులకు పంపిణీ చేయనున్నారు.



జీలుగ విత్తనాలు(ఫైల్)

గరిష్ఠంగా ఐదు బ్యాగులు

జీలుగ విత్తనాలు క్వింటా పూర్తి ధర రూ.12,300 కాగా, 50 శాతం రాయితీతో రూ.6,150 చొప్పున రైతులకు అందజేయనున్నారు. అలాగే క్వింటా జనుము విత్తనాల పూర్తి ధర రూ.10,900 కాగా, 50 శాతం రాయితీ పోనూ రూ.5,450 చెల్లించాలి. పిల్లిపెసర క్వింటా పూర్తి ధర రూ.18 వేలు కాగా, 50 శాతం రాయితీ పోనూ రూ.9 వేలు చొప్పున రైతులకు విక్రయిస్తారు. జీలుగ, జనుము విత్తనాలు 10 కిలోల ప్యాకెట్ల రూపంలో, పిల్లిపెసర 8 కిలోల ప్యాకెట్ కింద ఎకరాలోపు రైతులకు ఒక బ్యాగ్, రెండు ఎకరాలకు రెండు బ్యాగులు, మూడు ఎకరాలకు మూడు బ్యాగ్‌లు, నాలుగు ఎకరాలున్న రైతులకు నాలుగు బ్యాగ్‌లు, ఐదు ఎకరాలు, అంత కన్నా ఎక్కువ ఉన్న వారికి గరిష్ఠంగా ఐదు బ్యాగుల పంపిణీ చేయనున్నారు. రైతు ఆసక్తిని బట్టి మూడు రకాల విత్తనాలు వేర్వేరుగానూ, మూడు రకాల విత్తనాలు కలిపి ఒకే బ్యాగ్ రూపంలోనూ ఇవ్వనున్నారు. మూడు కలిపిన వాటిలో నాలుగు కిలోల చొప్పున జీలుగ, జనుము, రెండు కిలోల పిల్లిపెసర ఉంటాయి. 10 కిలోలు కలిగిన మిక్సింగ్ కిట్ పూర్తి ధర రూ.1,296 కాగా, 50 శాతం రాయితీ పోనూ రూ.648లు చొప్పున రైతులు చెల్లించాల్సి ఉంటుంది. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల(ఆర్‌ఎస్‌కే)లో తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీ సీడ్స్ ఉమ్మడి గుంటూరు జిల్లా మేనేజర్ పి.సుమలత శుక్రవారం 'సాక్షి'కి వివరించారు.

సఖీ నివాస్ ప్రారంభం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమం, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నగరంపాలెంలోని మహిళా ప్రాంగణంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ (సఖీ నివాస్)ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, సీనియర్ సిటీజన్ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎ.సూర్య కుమారి, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి , జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పాల్గొన్నారు. అనంతరం సంధ్యా రాణి మాట్లాడుతూ మహిళల భద్రత కోసం రూ.2.27 కోట్లతో సఖీ నివాస్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీయస్ పీడీ కె.విజయలక్ష్మీ, ఆర్జెడి జయలక్ష్మి, మహిళా సహకార ఆర్థిక సంస్థ జిల్లా మేనేజర్ రమణశ్రీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మజ, గుంటూరు పశ్చిమ తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కేఎల్‌యూలో అంతర్జాతీయ మహిళా సదస్సు



మహిళల హక్కులపై బ్రోచర్‌ను విడుదల చేస్తున్న అతిథులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో అంతర్జాతీయ మహిళా సమ్మిట్(సదస్సు)ను ఉమెన్ డెవలప్‌మెంట్‌సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పలువురు మహిళా మణులతో కలిసి ప్రో.చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సదస్సుకు గుంటూరుకు చెందిన సమగ్ర ఆస్పత్రి కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ కె.నీరజ, యూఎస్‌ఏ సాన్ డియగో యూనివర్శిటీ డీన్ డాక్టర్ మహాశ్వేత సర్కార్, కాసా ఎలైట్ డైరెక్టర్ ప్రీతి కొరటాల, రాష్ట్ర విపత్తుల శాఖ మేనేజర్ యశ్విని పెద్ది, చినోయ్ డిజైన్ మేనేజింగ్ డైరెక్టర్ సాందీపని వజ్జి, అఖిల భారత సైకలాజికల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కె.లక్ష్మీ తులసిబాయి, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు బొల్లినేని కీర్తి, హోప్ విన్ ఆస్పత్రుల వ్యవస్థాపక సీఈఓ ఎండీ షమా సుల్తానా, దిస్టెమ్ మేకర్ వ్యవస్థాపక సీఈఓ ఆష క్రాంతి నందిగం, ఏపీ హై కోర్టు న్యాయవాది అనుపమ దార్ల, కేఆర్ఆర్ ఇన్నోవేషన్ డైరెక్టర్ సిఇవో రష్మితరావు, లిటిల్ బ్లాక్ స్టార్ కో ఫౌండర్ తిరుమల శెట్టి మేఘన, సేఫ్, ఫన్ టైమ్ ఉపాధ్యక్షురాలు సుమ అట్లూరి ముఖ్యఅతిథులుగా హాజరై తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఏడు అంశాలపై బృందాలుగా ఏర్పడి చర్చలు జరిపారు. మహిళా సమ్మిట్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ రూతు రమ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కార్యదర్శి కోనేరు శివకాంచనలత తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరం ఆనందపేటలో గురువారం జరిగిన వృద్ధురాలి హత్య కేసులో పాతగుంటూరు పోలీసులు పురోగతి సాధించారు. ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 3న ఉదయం ఆనందపేటలో వృద్ధురాలు పఠాన్ ఖాజాబీని షేక్ ఫైరోజ్, ఫయాజ్, ఆసీఫ్, సన్ని అనే నలుగురు కొట్టి చంపారు. దీంతోపాటు ఖాజాబీ కుమార్తె షాజహాన్, అల్లుడు హసన్, వీరి కుమారుడు హర్షద్‌లపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన నగరంలో కలకలం రేపింది. దీంతో పోలీసులు ఫైరోజ్, ఫయాజ్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఇద్దరు నిందితులు ఆసీఫ్, సన్నీలు పరారీలో ఉన్నట్లు సమాచారం. పక్కా పథకం ప్రకారమే దాడికి తెగబడినట్లు నిందితులు అంగీకరించారని తెలుస్తోంది. మరో ఇద్దరు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు బృందంగా ఏర్పడి రంగంలో దిగారు.

సీఆర్డీఏ సిటిజన్ అడ్వైజరీ కమిటీలో రైతులకు చోటేదీ?

దళిత బహుజన జేఏసీ కన్వీనర్ చిలకా బసవయ్య

తాడికొండ: ఏపీ సీఆర్డీఏ గురువారం ప్రకటించిన సిటిజన్ అడ్వైజరీ కమిటీలో రాజధాని అమరావతి కోసం పోరాడిన వారిని మరవడం బాధాకరమని దళిత జేఏసీ కన్వీనర్ చిలకా బసవయ్య విమర్శించారు. గురువారం తుళ్ళూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ కోర్టులు, స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న మహిళామణులకు ఈ అడ్వైజరీ కమిటీలో చోటు దక్కలేదని ఆరోపించారు. కమిటీలో ధనవంతులకే చోటు దక్కిందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఓటు లేని వ్యక్తులూ కమిటీలో ఉండటంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ పునఃపరిశీలించి రైతులకు కమిటీలో చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుల సమస్యలపై దృష్టి సారించాలి

జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ్‌తేజ

గుంటూరు వెస్ట్: దివ్యాంగుల సమస్యలపై అధికారులు దృష్టి సారించి వారి ఇబ్బందులను గుర్తించాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి వికలాంగుల కమిటి సమావేశంలో జేసీ మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులు వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈసందర్భంగా వివిధ దివ్యాంగ సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ప్రభుత్వ షాపింగ్ కాంప్లెక్సులు, మున్సిపల్ కాంప్లెక్సుల్లో దుకాణాలు, స్టాల్స్ కేటాయింపులో దివ్యాంగులకు అవకాశాలు కల్పించాలన్నారు. సదరం సర్టిఫికెట్ల జారీలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వంద శాతం వినికిడి లోపం ఉన్నవారికి ఉచితంగా బస్సు పాస్ ఇవ్వాలన్నారు. దివ్యాంగుల ఉద్యోగాల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తే వారి కుటుంబాలు బాగుంటాయని పేర్కొన్నారు. అవసరం మేరకు ట్రైసైకిళ్లు మంజూరు చేయాలని కోరారు. సబ్సిడీ రుణాలు మంజూరు చేయడంలో గ్యారంటీగా ప్రభుత్వ ఉద్యోగి సూరిటీ అడుగుతున్నారని, దీన్ని కొంత ఆలోచించాలని పేర్కొన్నారు. సమావేశంలో వికలాంగుల సంక్షేమ అధికారి సువార్త, జెడ్పి సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో శుక్రవారం స్థానిక ఎన్జీఓ రిక్రియేషన్ హాల్లో జరిగింది. సమావేశానికి జిల్లా జేఏసీ చైర్మన్, సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీష్, రాష్ట్ర కార్యదర్శి రాంప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన సుమారు రూ.25వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఎన్జీఓ సంఘ నాయకులు చేసిన విజ్ఞప్తి మేరకు సర్కారు రూ. 7,200 కోట్లు విడుదల చేసిందని వివరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శిగా శ్యామ్ సుందర్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సుకుమార్, మహిళా ఉపాధ్యక్షురాలుగా శ్రీవాణి, మహిళా సంయుక్త కార్యదర్శిగా విజయలక్ష్మి, జిల్లా సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ జానీ భాష, కృష్ణకిషోర్, విజయబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగూర్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, పివి నాగేశ్వరరావు, ధనుంజయ నాయక్, ట్రెజరర్ శ్రీధర్ రెడ్డి గుంటూరు నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు సూరి, కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన మహిళా విభాగం నాయకురాలు రాధా రాణిని, బదిలీపై వెళ్లిన మహిళా సంఘం నాయకురాళ్ళు శివజ్యోతి, లక్ష్మీరమ్యలను సత్కరించారు.



నేతలను సన్మానిస్తున్న ఘంటసాల శ్రీనివాసరావు, జగదీష్, రాంప్రసాద్ తదితరులు

డీఆర్‌ఎం రామకృష్ణ బదిలీ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ బదిలీ అయ్యారు. ఆయన నైరుతీ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. స్థానిక పట్టాభిపురం రైల్వే డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం ఆయనకు అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా డివిజన్ ఏడీఆర్‌ఎం సైమన్ మాట్లాడుతూ రామకృష్ణ కృషిని కొనియాడారు. డీఆర్‌ఎం రామకృష్ణ మాట్లాడుతూ సంతృప్తికరంగా విధులు నిర్వర్తించినట్లు వివరించారు. అనంతరం రామకృష్ణను ఏడీఆర్‌ఎం సైమన్, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, సీనియర్ డీపీఓ రత్నాకర్, సీనియర్ డీఎస్‌టీఈ మద్దాలి రవికిరణ్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, యూనియన్ నాయకులు, సంఘ్ యూనియన్ తదితరులు సత్కరించారు.



డీఆర్‌ఎం రామకృష్ణను సత్కరిస్తున్న యూనియన్ నాయకులు, అధికారులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా

తాడికొండ: రాజధానిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తుళ్ళూరులో కార్మికులతో కలిసి సీఐటీయూ నేతలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఆర్డీయే కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రవి, ఎం భాగ్యరాజు, కార్మిక సంఘం నాయకులు సీహెచ్ సుశీల, ఏసుదయమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రాజధాని కార్మికులు

క్రైస్తవుల భద్రతకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి

ఐఆర్‌ఈఎఫ్ అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా

రేపల్లె రూరల్: క్రైస్తవుల భద్రతకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఐఆర్‌ఈఎఫ్ అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా అన్నారు. అనుమానాస్పద స్థితిలో ఇటీవల మృతి చెందిన పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రేపల్లె క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శాంతి ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవుని వాక్యాన్ని ప్రజలకు చేర్చి పరిశుద్ధులను చేసే పాస్టర్‌లపై దాడులకు పాల్పడటం అమానుషమని పేర్కొన్నారు. క్రైస్తవులపై దాడులు జరగకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ బాపట్ల జిల్లా మాజీ అధ్యక్షుడు చిత్రాల ఓబేదు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం అన్నికోణాలలో సమగ్ర విచారణ జరిపి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో పాస్టర్లపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చట్టాలను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రవీణ కుటుంబ సభ్యులకు క్రైస్తవ సంఘాలు అన్ని వేళలా అండగా నిలుస్తాయని అన్నారు. ర్యాలీ బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం , నెహ్రూ బొమ్మ సెంటరుల మీదగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్, పోలీసుస్టేషన్‌లలో వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, గుజ్జర్లమూడి ఇమ్మానుయేలు, సముద్రాల ప్రభుకిరణ్, షేక్ ఖుద్దూష్, ఆలా రాజ్‌పాల్, జాలాది మునియ్య, జాలాది సునీల్, వివిధ చర్చిల పాస్టర్‌లు, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఆర్‌ఈఎఫ్ అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా



పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న రేపల్లె క్రైస్తవ సంఘాల నాయకులు

షాలిమార్–వాస్కోడిగామ మధ్య రైళ్లు తాత్కాలిక రద్దు

లక్ష్మీపురం: అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో రెండు రైళ్లను తాత్కాలిక రద్దు చేసినట్టు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. రైలు నంబరు 18042 షాలిమార్ – వాస్కోడిగామను ఈనెల 17, 19, 21, 22, 24, 26, 28 తేదీల్లో తాత్కాలికంగా రద్దు చేసినట్టు వివరించారు. నంబర్ 18048 వాస్కోడిగామా – షాలిమార్ రైలును ఈనెల 20, 22, 24, 25, 27, 29 తేదీల్లో తాత్కాలికంగా రద్దు చేసినట్టు వెల్లడించారు.

ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలి

చీరాల టౌన్: ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వలేని ప్రభుత్వం ఓ వైపు.....అకాల వర్షంతో అన్నదాతలు పండించిన పంట తడిచి రైతులను నట్టేట ముంచిందని ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కావూరి రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈపురుపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి కల్లాల్లో తడిచిన ధాన్యాన్ని వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రబీ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉండటం దారుణమన్నారు. ప్రభుత్వం ధర రూ.1750 ఉండగా రబీ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు, దళారులు బస్తాను రూ.1350కి కొనుగోలు చేయడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రబీ ధాన్యాన్ని మార్చిలోనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోగా అధికారంలోకి వచ్చిన టీడీపీ, కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతుల కష్టాలను గుర్తించి సీఎం చంద్రబాబు బస్తాకు రూ.1750 ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

సిద్ధార్థ్‌కు సన్మానం

గుంటూరు మెడికల్: హృదయ సంబంధ వ్యాధుల గుర్తించే యాప్‌ను కనుక్కున్న సిద్ధార్థ్ నంద్యాలను శుక్రవారం ఆస్పత్రి సూరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ సన్మానించారు. ఈ సందర్భంగా యాన మాట్లాడుతూ డీఎంఈ ఆదేశాల మేరకు పైలట్ ప్రాజెక్టుగా సిద్ధార్థ్ ఈనెల 1 నుంచి 3 వరకు రోగులకు పరీక్షలు నిర్వహించినట్టు వివరించారు. మొత్తం 863 మంది రోగులు స్క్రీనింగ్ చేయగా 16 మందికి హృద్రోగ సమస్యలు ఉన్నట్టు గుర్తించామని పేర్కొన్నారు.



సిద్ధార్థ్ నంద్యాలను సన్మానిస్తున్న డాక్టర్ యశశ్వి రమణ

కూలీల ఆటో బోల్తా.. ఒకరు మృతి



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మరో ఏడుగురికి తీవ్రగాయాలు

వినుకొండ: మిరపకాయల కూలీల ఆటో తిరబడి ఒకరు మృతి చెందగా.. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఏనుగుపాలెం సమీపంలో జరిగింది. ఉమ్మడివరం నుంచి నూజెండ్ల మండలం త్రిపురాపురం గ్రామానికి మిర్చి కోసేందుకు ప్రతిరోజు కూలీలు వెళ్తా ఉంటారు. ఉదయం ఏనుగుపాలెం సమీపంలో ఆటో తిరగబడింది. ఈ ప్రమాదంలో జోజమ్మ (60) మృతి చెందింది. మార్తమ్మ, వెంకాయమ్మ, అంకమ్మ, కోటమ్మ, మరియమ్మ, ఆదెమ్మ తదితర ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో వారిని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందిస్తున్నారు.



జోజమ్మ మృతదేహం

రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య

నరసరావుపేటటౌన్: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి సంఘటన శుక్రవారం సాతులూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాతులూరు రైల్వే స్టేషన్ సమీపంలో హుబ్లీ ఎక్స్‌ప్రెస్ కింద పడి పెద్దచెరువు ప్రాంతానికి చెందిన గాలి థామస్(70) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన పైలెట్ సమాచారాన్ని నరసరావుపేట రైల్వే పోలీసులకు అందించారు. ఎస్‌ఐ శ్రీనివాసనాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.



సంఘటనా స్థలంలో మృతదేహం

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ BPT, B.Sc (MLT) సీట్లు: విజయవాడలోని ప్రముఖ కాలేజీలో 2024–25 సం.కి BPT, B.Sc (MLT) మేనేజ్‌మెంట్ సీట్లు కలవు. సంప్ర: Principal, 8008280062.

ADMISSIONS

■ గుంటూరు BiPC ఇంటర్ పాస్ అయిన వారికి ఫిజియోథెరపి డాక్టర్స్ కోర్స్ BPT, MPT సీట్లు కలవు. అతి తక్కువ ఖర్చులతో హాస్టల్ వసతి కలదు. ఫిజియోథెరపి ట్రీట్‌మెంట్ కలదు. 8977778838, 8977779908

REAL ESTATE

■ అమరావతి IJM రైస్ ట్రీ పార్క్, నంబూరు కొప్పురావూరు, కంతేరు, పరిసర ప్రాంతాలలో ఉడా అప్రూవల్ ప్లాట్స్ కావలసినవారు సంప్ర. M.V.చౌదరి. 9885163444

■ బాపట్ల జిల్లా, అమృతలూరు గ్రామంలో మంచి లొకాలిటీలో 215 గజాల ఇంటి స్థలం & రోడ్డుకు సమీపంలో 5 ఎకరాల పొలం అమ్మకానికి కలదు. సంప్ర: 7893841849

PLOT FOR SALE

■ శ్రీ కృష్ణ బృందావనం! ఫార్మ్ హౌస్ లాండ్ గుంటూర్ (కొండవీడు) 25 కి.మీ పర్యటక ప్రాంతం సమీపంలో@ సెంటు లక్ష రూపాయలు. (10,14) సెంట్లు ప్లాట్స్ కలవు 9381449563

RENT

■ గుంటూరు, నల్లపాడు హౌసింగ్ బోర్డు కాలనీ, HIG No.61, Opp.నల్లగుంట 90Ft Road, East Facingతో, బ్యాంకులకు, ఆఫీసులకు, Software, Hardware,Schools, Collegeలకు అనువుగా ఉన్న 4 అంతస్తుల కమర్షియల్ (Each Floor 2240Sft) బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును. Lift, Car Parking కలదు. 89851 85685, 86394 28705.

TOLET COMMERCIAL

■ గుంటూరు గుజ్జనగుండ్ల కరెంట్ ఆఫీసు సమీపంలో మెయిన్‌రోడ్డు అనుకొని 2వ ఫ్లోర్ 400చ॥గ॥ గోడం అద్దెకు కలదు. (కరెంట్, బోర్ కలదు). సంప్ర: 9347166899

WANTED

■ ప్రముఖసంస్థ నందు వంట చేయుటకు, ఆఫీస్ వర్క్ కొరకు మరియు హెల్పర్లు కావలెను. 19 నుండి 35 సం॥లోపు స్త్రీలు కావలెను. భోజన & వసతి కల్పించబడును. 9642807739

■ Wanted B-pharmacy or D-pharmacy candidates to work in a pharmacy in guntur city. Pci registration mandatory and wanted packing & delivery boys.Q:10th 6300975241

■ Wanted Female Accountants (B-com or M-com) Having work experience in audit offices, proficient in Tally Prime, GST & Income tax Filing to work in guntur city. 6300975241.

■ ప్రముఖ కూల్‌డ్రింక్ కంపెనిలో మార్కెటింగ్ చేయుటకు యువతి, యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15,000/–+3వేలు వెంటనే సంప్రదించండి. 9121468383

■ గుంటూరు ఫిజియోథెరపి కాలేజ నందు క్రైస్తవ మహిళలకు అవకాశం.లైబ్రరీన్ MLIC, అకౌంటెంట్ CA, DTP డిజైనర్ తెలుగు, ఇంగ్లీష్ టైపింగ్, ప్రాజెక్ట్ డ్రాఫ్టింగ్ జాబ్స్ కలవు. 87121 00333

■ గుంటూరు బృందావన్‌గార్డెన్స్, NTR కాంప్లెక్స్ లో గల సిరి స్వీట్స్ షాపు నందు పనిచేయుటకు సేల్స్ గాల్స్ కావలెను. 10th, P/F జీ: 18-20వేలు. టైం: 9am-8pm & 3pm-10pm, 9347166699

■ ప్రముఖ స్టార్ హోటల్ గీతాంజలి నందు పనిచేయుటకు రెస్టారెంట్ వెయిటర్స్ & బాయ్స్ (వెజ్ మరియు నాన్ వెజ్), రూమ్ సర్వీస్ వెయిటర్స్, చైనీస్ మాస్టర్స్, పూరి & రైస్ మాస్టర్స్ ఆల్ రౌండర్స్, మెయింటెనెన్స్ బాయ్స్, హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్స్, వాష్ పాంట్రీ మరియు కిచెన్ అసిస్టెంట్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర: 4/1, అరండల్‌పేట, గుంటూరు. 99490 77525

■ ఉచితంగా కంప్యూటర్ MS Office, Spoken English, Computer హార్డ్‌వేర్ కోర్సులలో 3 నెలలో శిక్షణ ఇచ్చి 100% ఉపాధి చూపించబడును. ఫ్రీ భోజనం, హాస్టల్. Qul: 10th, Inter, Degree, ITI and above, గుంటూరు. 9133444986 / 88 / 89

■ ఉచితంగా Solar Technician, MS-Office, Spoken English కోర్సులలో 3 నెల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించబడును. ఉచిత భోజన & హాస్టల్ వసతి. Q:10th, Inter, B.Tech and above (Pass/Fail) Age: 18-27సం॥ Add : గుంటూరు 9177133358, 9133444989

■ డ్రైవర్స్ కావలెను. కారు నడిపిన అనుభవం ఉండవలెను. తగిన లైసెన్స్ ఉండాలి. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. అర్హతను బట్టి PF మరియు ESI సదుపాయం కలదు. పనిచేయు స్థలం: గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 92487 22282

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25–30వేలు వరకు సంపాదించుకోండి. అర్జ్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459.

■ Sri Saradha Niketan Public School Martur Bapatla Dist. Wanted Jobs Maths, Physics, Chemistry Qly M.Sc B.Ed (Exp 5 to 10 Yrs) With JEE. Mains, Neet, English-01, B.A (or) M.A CEB-01 (M.Com or M.B.A) Computer Operator-02 (Any Computer Certificate) Ph. ✆ 70957 23036, 93988 32060

■ త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఉచిత వసతి భోజనం. జీతం:18K.Ph:8520980099, 8520874499

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ఎడిషన్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

గుంటూరు 7075167663 7075167541

గమనిక